లిస్ట్‌లో ట్విస్ట్‌లు

- నష్ట గణన నమోదులో గందరగోళం
- ముంపు బాధితులను వదిలేసిన అధికారులు
- అసలు ముంపే లేని వ్యక్తులకు పరిహారం జమ
- ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్న బాధితులు
- నాలుగు మండలాల్లో 17,022 మందిని నష్ట గణన జాబితాలో చేర్చిన అధికారులు



ఇబ్రహీంపట్నం సచివాలయం-4లో రెండో లిస్ట్ కోసం పేర్లు నమోదు చేయించుకుంటున్న బాధితులు



రెండో లిస్ట్‌లో పేర్ల నమోదు కోసం జి.కొండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న వరద బాధితులు

జి.కొండూరు: ముంపు బాధితుల నమోదులో గందరగోళం నెలకొంది. అధికారులు అసలు బాధితులను వదిలి బాధితులే కాని వ్యక్తులను లిస్ట్‌లో చేర్చారు. ఫలితంగా బాధితులకు పరిహారం అందకపోగా అసలు బాధితులే కాని వ్యక్తులకు పరిహారం జమైంది. దీనితో బాధితులు ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు పడుతున్నారు. వలంటీర్లు లేకుండా సచివాలయాల ఉద్యోగులు నష్ట గణన చేయడం వల్లే ఈ సమస్య తలెత్తిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాధితులకు న్యాయం జరిగేనా..

ఇటీవల బుడమేరు, కృష్ణానదికి వచ్చిన వరదలతో మైలవరం నియోజకవర్గంలోని వేల ఇళ్లు, వ్యాపార దుకాణాలు, పరిశ్రమలు నీట మునిగాయి. పంట భూములు, పశువులు, పశుగ్రాసం ఇలా అన్ని రకాలుగా నియోజకవర్గ ప్రజలు నష్ట పోయారు. అధికారులు నష్టం నమోదులో బాధితులు కాని వ్యక్తులను నమోదు చేశారు. జి.కొండూరు, మైలవరం మండలాల పరిధిలో బాధితులు తమను కూడా నష్టపోయిన వారి లిస్ట్‌లో చేర్చాలంటూ కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటి వరకు రెడ్డిగూడెం మండల పరిధిలో 350 మంది, మైలవరం మండల పరిధిలో 3,500 మంది, జి.కొండూరు మండల పరిధిలో 2,172 మంది, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 11 వేల మంది బాధితులను అధికారులు నష్ట గణన లిస్ట్‌లో చేర్చి ప్రభుత్వానికి పంపారు. అయితే వీరిలో 20 శాతం మంది వరకు అసలు బాధితులు కాని వ్యక్తులే ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అధికారులు ప్రభుత్వానికి పంపిన లిస్ట్ కాకుండా జాబితాలో చేర్చని మరో 5 వేల మంది వరకు బాధితులు ఉండవచ్చని తెలుస్తోంది.

సెకండ్ లిస్ట్ డాటే

వరద మంపు బాధితులు తమ పేర్లు లిస్ట్‌లో చేర్చకపోవడంపై అధికారులను నిలదీస్తున్నారు. ఈ క్రమంలో బాధితులెవరన్నా ఉంటే నమోదు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు జారీ కాలేదని, మిగిలిన బాధితులను నమోదు చేసిన తర్వాత ప్రభుత్వం జీఓ ఇస్తే పరిహారం అందుతుందని అధికారులు బహిరంగంగానే చెబుతున్నారు. దీనిని బట్టి రెండో లిస్ట్‌లో పేర్లు నమోదైన బాధితులకు పరిహారం అందడంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

జి.కొండూరు మండలంలో గందరగోళం

జి.కొండూరు మండల పరిధిలో వరద ముంపు బాధితుల నమోదు ప్రక్రియలో తీవ్ర గందరగోళం నెలకొంది. పలు గ్రామాల్లో అసలు అధికారులు బాధితుల ఇళ్లకు కూడా వెళ్లనేలేదు. మొదట ఎన్యూమరేషన్ చేసిన సమయంలో వ్యాపార దుకాణాలకు వేరుగా నమోదు చేసిన అధికారులు మిగిలిన బాధితులు ఇప్పుడు నమోదు చేయమని అడిగితే ఇళ్లు మునిగినట్లు నమోదు చేస్తామని అధికారులు చెబుతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలు మునిగి రూ.లక్షల్లో నష్టపోతే ఇళ్లు మునిగినట్లు నమోదు చేయడం వల్లన రూ.10 వేలు మాత్రమే వస్తుందని, దీనివల్ల తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని బాధితులు వాపోతున్నారు. అదేవిధంగా కవులూరు గ్రామంలో వరద మంపునకు గురైన వరి పైరు నమోదు ప్రక్రియలో అవకతవకలు జరిగాయని రైతులు బహిరంగంగానే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మంపునకు గురైన 300కు పైగా ఎకరాలను అసలు ఎన్యూమరేషన్ చేయలేదని ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా ఇప్పటికే నమోదు చేసిన వారికి కూడా పరిహారం జమకాలేదని బాధితులు ఆందోళన చెందుతున్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందజేత

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



కట్టుబడిపాలెంలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత

జి.కొండూరు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దనే పింఛన్‌ను పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధి కట్టుబడిపాలెం గ్రామంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే మంగళవారం పింఛన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల పరిధిలో ఈ నెల 8,661మంది లబ్ధిదారులకు రూ.3,67,77,500 పింఛన్ నగదు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

96 శాతం పెన్షన్ల పంపిణీ

తిరువూరు: తిరువూరు పట్టణంలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేపట్టారు. 3,399 మంది పెన్షనర్లకు రూ.1.43 కోట్ల పెన్షన్ నగదును సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. నగర పంచాయతీ పరిధిలో 96 శాతం పెన్షన్లను అందజేశారని కమిషనర్ లోవరాజు తెలిపారు. మండలంలోని 20 పంచాయతీలలో 6,827 మంది పెన్షనర్లుండగా 6,560 మందికి పెన్షన్ల పంపిణీ చేశామని, 96 శాతం పెన్షన్లు పంపిణీ చేశామని ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు చెప్పారు.

- ఇబ్రహీంపట్నం: మండల పరిధి గ్రామాల్లో సామాజిక పింఛన్లు 95.84 శాతం పంపిణీ చేశామని ఎంపీడీఓ రామకృష్ణనాయక్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి

దేవినేని అవినాష్



ఇబ్రహీంపట్నం: గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. ఇబ్రహీంపట్నానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పచ్చిగోళ్ల పండు, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి బత్తుల రాజేష్ మర్యాదపూర్వకంగా మంగళవారం అవినాష్‌ను కలవగా ఆయన పై విధంగా స్పందించారు. నేను, నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా అవినాష్‌కు వారు అభినందనలు తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా రాణి

చాట్రాయి: ముసునూరు ఎంపీడీఓ జి.రాణి చాట్రాయి మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా మంగళ వారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సిబ్బంది అభినందించారు.

రైతులను కుక్కలతో పోల్చడం దారుణం

- ఎమ్మెల్యే కొలికపూడి క్షమాపణ చెప్పాలి
- పల్లెపాటి శ్రీనివాసరావు డిమాండ్

తిరువూరు: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు రైతులను కుక్కలతో పోల్చడం దారుణమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పల్లెపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యావంతుడైన ఎమ్మెల్యే తరచూ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతున్నారని, నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. రైతులకు కృతజ్ఞత లేదని, వారికంటే కుక్కలు విశ్వాసంగా ఉంటాయంటూ ఎమ్మెల్యే మాట్లాడటం ఆయన పదవికి తగినట్లు లేవని, వెంటనే ఆయన రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తిరువూరు ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారెవరూ ఇంతవరకు కొలికపూడి తరహాలో ప్రవర్తించలేదని, గెలిచిన మూడు నెలల్లోనే ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే విజ్ఞత కోల్పోయి ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. పార్టీ నాయకులు ఉప్పలపాటి లక్ష్మీదాసు, జీవన్‌బాబు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు క్షమాపణ చెప్పాలి

గంపలగూడెం: కుక్కలకైనా విశ్వాసం ఉంటుంది కానీ రైతులకు లేదంటూ తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం. వెంకటరెడ్డి ఖండించారు. గంపలగూడెం మండలం అనుముల్లంకలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన సొంత ఖర్చుతో సాగునీటి చెరువులు, కాలువలు అభివృద్ధి చేశానని చెబుతున్న ఎమ్మెల్యే తాను చేసే దీక్షలకు రైతులు హాజరు కాలేదన్న అక్కసుతో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. రైతులను కించపరిచిన ఎమ్మెల్యే వెంటనే క్షమాపణ చెప్పాలని, రైతులకు పరిహారం పూర్తిగా ఇప్పించాలని డిమాండ్ చేశారు.

చట్టంలో మార్పులపై ఆందోళన

నూజివీడు: న్యాయవాదుల చట్టంలో మార్పులను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వాలు వెంటనే నిలిపివేయాలని నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ డిమాండ్ చేశారు. నూజివీడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి స్థానిక కోర్టు భవనం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా న్యాయవాదులు నినాదాలు చేశారు. అనంతరం పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల హక్కులను కాలరాసే చట్టాన్ని చేస్తూ న్యాయవాద వృత్తిని అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని.. న్యాయవాద సవరణ చట్టాన్ని నిలిపివేయాలన్నారు. బార్ సెక్రటరీ మడపల్లి మధు రవి శంకర్, న్యాయవాదులు దేవినేని సూర్యనాథ్, నక్కనబోయిన మురళీకృష్ణ, లక్ష్మణరావు, నరసింహారావు, కేజే డిక్సన్, పి. రవిబాబు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపిక

నూజివీడు: పట్టణంలో ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ ఆటల పోటీల్లో మీర్జాపురం హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం పుష్పలత మంగళవారం తెలిపారు. సీనియర్ విభాగంలో షాట్‌పుట్‌లో పి. షాహీద్, కె. హర్షవర్ధన్, జావెలిన్ త్రోలో కె. హర్షవర్ధన్, 800 మీటర్ల రన్నింగ్‌లో షేక్ అర్షద్, కబడ్డీలో షేక్ షాహీద్ టీం, వాలీబాల్‌లో ఎల్. శేఖర్‌బాబు, కె హర్షవర్ధన్, లాంగ్‌జంప్‌లో పి. షాహీద్, జూనియర్ కేటగిరి కబడ్డీలో వి. మధు, ఎల్. తేజ, ఖోఖోలో ఎస్.విక్రమ్, వాలీబాల్‌లో ఎస్.నవీన్, లాంగ్‌జంప్ ఎస్.విక్రమ్, షాట్‌పుట్‌లో ఎల్.జోసఫ్ డానీ ఎంపికయ్యారు.

గొల్లపల్లి విద్యార్థుల ఎంపిక..

మండలంలోని గొల్లపల్లి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి తెలిపారు. కబడ్డీ, ఖోఖో, యోగా, షటిల్‌లో అండర్-14, అండర్-17 విభాగాల్లో ఎంపికయ్యారన్నారు. హర్ష, దేవ త్రినాథ్, సాయిహర్ష, రుషి, రాజ్‌కుమార్, సంతోష్, జగదీష్, కిరణ్, దివ్యరాణి, నందిని, మేఘన, వంశీ, విజయ్‌కుమార్ ఎంపికయ్యారని చెప్పారు.

- తిరువూరురూరల్: తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగాల్లో తమ పాఠశాల విద్యార్థులు 26 మంది ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ తెలిపారు. మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు అంశాల్లో జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, షాట్‌పుట్, రన్నింగ్, డిస్కస్ త్రో విభాగాల్లో 19 మంది విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు బి. వీరభద్రరావు చెప్పారు. కోకిలంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి అండర్ 16 ఖోఖో విభాగంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు గుప్తా తెలిపారు.

గంపలగూడెం విద్యార్థుల ఎంపిక

గంపలగూడెం: జిల్లా స్థాయి పోటీలకు గంపలగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు బొల్లెపోగు కిరణ్ తెలిపారు. అండర్ 14 బాలుర వాలీబాల్ పోటీలకు జి. శశాంక్, అండర్ 17లో ఎం. విజయ్‌చంద్, అండర్ 14 బాలికల విభాగంలో వి వరలక్ష్మి, అండర్ 17 బాలికల కబడ్డీలో డి. చైతన్య, షటిల్‌లో నాగకీర్తి ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

10 మద్యం షాపులకు అనుమతులు

మైలవరం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మైలవరం మండలంలో 4 షాపులు, జి.కొండూరు మండలంలో 4 షాపులు, రెడ్డిగూడెం మండలంలో 2 షాపులు మొత్తం 10 మద్యం షాపులకు లాటరీ పద్ధతిలో వేలం నిర్వహిస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జోశ్యుల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆన్ లైన్ లేదా ఆఫ్ లైన్‌లో సమర్పించవచ్చన్నారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ గెజిట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, మైలవరంలో సంప్రదించాలని చెప్పారు.

క్లుప్తంగా

వసతి గృహాలు తనిఖీ చేసిన జడ్జి

తిరువూరు: రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. మోతీలాల్ మంగళవారం వెనుకబడిన తరగతుల బాలుర, బాలికల వసతి గృహాలను సందర్శించారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మెనూ అమలు చేయాలని వార్డెన్లకు సూచించారు. బీసీ బాలుర వసతి గృహానికి జడ్జి సీలింగ్ ఫ్యాన్‌ను అందజేశారు. తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

నూజివీడు: పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరకుండా ఉంటాయని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నూజివీడు 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం జడ్జిలు, న్యాయవాదులు కలిసి పట్టణంలోని కోర్టు పరిసరాలను ఊడ్చి శుభ్రం చేశారు. సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. హరిబాబు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

నూజివీడు: వృద్ధుల సంక్షేమం, వారి హక్కుల రక్షణకు ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చాయని, వాటిపై వృద్ధులు అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. హరిబాబు అన్నారు. పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ సంఘ కార్యాలయంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచిత న్యాయ సాయాన్ని అందజేస్తున్నామన్నారు. అసోసియేషన్ కార్యదర్శి బండారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

ఎంపీడీఓ రామకృష్ణ నాయక్

ఇబ్రహీంపట్నం: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవాటు చేసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ అన్నారు. స్థానిక జాకీర్‌హుస్సేన్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం చెకుముకి టాలెంట్ టెస్ట్ ముగింపు కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతి సైన్స్, సాంకేతిక రంగాలపై ఆధారపడి ఉందన్నారు. భవిష్యత్‌లో దేశానికి ఉపయోగపడే ఆవిష్కరణలు పట్టుదల సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఎంఈఓ సీహెచ్ పుష్పలత, జేవీవీ జిల్లా అధ్యక్ష ఉపాధ్యక్షులు వి.మురళీమోహన్, కామేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి గేయాల పోటీలు

మైలవరం: విద్యార్థి దశ నుంచే దేశభక్తి అలవర్చుకోవాలని ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి. గోపాల్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే వీరగాథ 4.0 కార్యక్రమంలో భాగంగా మైలవరం ఆరో వార్డులోని ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు పద్యాల తోరణం, చిత్ర లేఖనం, దేశభక్తి గేయాలు పోటీలు మంగళవారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచే ఇతిహాసాలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్‌రావు, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఆహార పొట్లాలు పంపిణీ

మైలవరం: మైలవరం మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోడ్డు పక్కన నివశించే నిరుపేదలకు మంగళవారం ఆహార పొట్లాలు, మినరల్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ మాట్లాడుతూ నిస్సహాయులకు సేవ చేయడం దైవ సేవతో సమానమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల బతుకమ్మ సంబరాలు

తిరువూరు: స్థానిక శ్రీనిధి స్కూల్లో మంగళవారం దసరా వేడుకల్లో భాగంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. దేవీ నవరాత్రి ఉత్సవాల ప్రాముఖ్యతను తెలుపుతూ అమ్మవారి అలంకారాలతో, నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు. దసరా పండుగ జరుపుకోవాల్సిన ఆవశ్యకతను పాఠశాల కరస్పాండెంటు కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్ వెంకటనారాయణ విద్యార్థులకు వివరించారు.

రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాణం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని బ్రాహ్మణ వీధిలో ఓ వ్యక్తి సిమెంట్ రోడ్డుపై అడ్డంగా గోడ నిర్మించాడు. సాయిరాం అనే వ్యక్తి కొత్తగా ఇల్లు నిర్మించుకుని డ్రెయినేజీ నిర్మిస్తున్నాడని, దాని వల్ల డ్రెయినేజీ నీరు నేలబావిలో వస్తుందనే గోడ కట్టినట్లు ఆ వ్యక్తి చెబుతున్నాడు. ఈ గోడపై పంచాయతీ అధికారులకు కొంతమంది ఫిర్యాదు చేశారు. పంచాయతీ అధికారి బొల్లినేని ప్రసాద్‌ను వివరణ కోరగా ఇరువర్గాలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

పంచాయతీ కార్మికులకు సత్కారం

మైలవరం: మైలవరం పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ మంజుభార్గవి, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

• బాలికల గురుకుల పాఠశాల తనిఖీ

కొండపర్వ (విస్సన్నపేట): కొండపర్వ గ్రామంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను డెప్యూటీ సెక్రటరీ సుభాషిణి రాణి మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను, స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వినీల పాల్గొన్నారు.

• నూజివీడు ఎక్సైజ్ సీఐగా మస్తానయ్య

నూజివీడు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐగా అప్పంగారి మస్తానయ్య నియమితులయ్యారు. డివిజనల్ టాస్క్‌ఫోర్స్(విజయవాడ) ఎస్ఐగా పనిచేస్తున్న ఆయన బదిలీపై నూజివీడు ఎక్సైజ్ సీఐగా వచ్చారు. ఇంత వరకు ఇక్కడ పనిచేస్తున్న సీఐ వెంకటరమణ గుడివాడకు బదిలీ అయ్యారు.

• టాలెంట్ టెస్ట్‌కు 51మంది హాజరు

గంపలగూడెం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 51 మంది హాజరయ్యారు. గంపలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పోటీల్లో ప్రథమస్థానం కనుమూరు, ద్వితీయ స్థానం గంపలగూడెం జెడ్పీ పాఠశాలలు సాధించాయి. ప్రైవేటు పాఠశాలల పోటీల్లో ప్రథమస్థానం లిటిల్ ఏంజెల్స్, ద్వితీయ స్థానం గాయత్రి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు సాధించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

• మున్సిపల్ కార్మికుల భిక్షాటన వాయిదా

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సకాలంలో వేతనాలు చెల్లించని అధికారుల తీరుపై నిరసనగా మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం చేపట్టాల్సిన భిక్షాటన, వంటా వార్పు కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేశామని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన అభ్యర్థన మేరకు ఈ కార్యక్రమం వాయిదా వేశామన్నారు.

• పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరం ఎంపీపీ పాఠశాలలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను విద్యార్థులు తొలగించారు. పాఠశాల తరగతి గదులను శుభ్రం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• సహకార సంఘంలో..

లక్ష్మీపురం(తిరువూరురూరల్): లక్ష్మీపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం జరిగింది. పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై రైతులకు, సంఘ సభ్యులకు అవగాహన కల్పిస్తూ సహకార సిబ్బంది మొక్కలు నాటారు. సంఘ సీఈఓ బొల్లినేని రఘురాం తదితరులు పాల్గొన్నారు.

• డీపీఆర్టీయూ నేతకు దేవానందరెడ్డి పరామర్శ

ఇబ్రహీంపట్నం: అనారోగ్యంతో బాధపడుతున్న డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అక్బర్ పాషాను రాష్ట్ర పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి మంగళవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. డీపీఆర్టీయూ నేత ఇర్ఫాన్‌పాషా, సీఆర్పీ దొంతమాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

• రాళ్ల చెరువు గండి పరిశీలన

వినగడప(గంపలగూడెం): ఇటీవల వచ్చిన వరదలకు అనుముల్లంక, వినగడప గ్రామాల మధ్య రాళ్ల చెరువుకు పడిన గండిని శాశ్వతంగా పూడ్చి సాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం పార్టీ సెక్రటేరియట్ సభ్యులు నాగేంద్రప్రసాద్, మండల కార్యదర్శి గువ్వల సీతారామిరెడ్డి, మండల కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, కుటుంబరావు, నాళ్ల చిన్నసత్యంబాబుతో కలిసి రాళ్ల చెరువు గండిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెరువు అలుగు వాగులో ఉన్న ఆక్రమణలను తొలగించి నీరు సక్రమంగా దిగువకు పారేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నష్టపోయిన రైతులందరినీ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

• నూర్‌బాషా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా బాబు

జి.కొండూరు: నూర్‌బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా జి.కొండూరుకు చెందిన షేక్ బాబు మంగళవారం నియమితులయ్యారు. మైలవరంలో సంఘం జిలా అధ్యక్షుడు ఎస్‌కే కాజా రహంతుల్లా, కార్యదర్శి షేక్ ఖాసీం షరీఫ్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. జి.కొండూరు మండల అధ్యక్షుడిగా షేక్ కొండబాబు ఎన్నికయ్యారు.

• వరిలో తెగుళ్ల నివారణ చేపట్టాలి

అక్కపాలెం(తిరువూరురూరల్): ఖరీఫ్ వరిలో తెగుళ్లు ఆశిస్తున్నందున రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ శాఖ వనరుల కేంద్రం ఉప సంచాలకులు మాధవీలత అన్నారు. అక్కపాలెంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఆమె వివరించారు. వ్యవసాయాధికారి పద్మ, వ్యవసాయానుబంధ శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

• విజేతలకు బహుమతుల పంపిణీ

తిరువూరు: విద్యార్థులు మూఢనమ్మకాలు విడనాడి శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వల్లభనేని రవీంద్ర అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సంబరాలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

• సాంకేతిక నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు

తిరువూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కిలారు వెంకటేశ్వరరావు అన్నారు. కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ ఈసీఈ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్లు నిర్వహించిన కార్నివాల్ 2కే 24 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సృజనాత్మక ధోరణి ఉన్న విద్యార్థులకే అవకాశాలు లభిస్తున్నాయని, కేవలం మార్కుల కోసం కాకుండా నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

• టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

మైలవరం: రెడ్డిగూడెం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ స్థానిక గీతాంజలి హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. గీతాంజలి హైస్కూల్ ప్రథమ స్థానం, శ్రీ నారాయణ హైస్కూల్ ద్వితీయ స్థానం దక్కించుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల నుంచి మద్దులపర్వ మోడల్ స్కూల్ టీమ్ ప్రథమ, కూనపురాజుపర్వ జెడ్పీహెచ్ స్కూల్ టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. పై నాలుగు టీమ్‌లు జిల్లా స్థాయిలో జరిగే చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యాయని జేవీవీ జిల్లా కమిటీ సభ్యులు జి. మల్లికార్జునరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథి మండల కమ్యూనిటీ ఆస్పత్రి వైద్యాధికారి శ్యామ్ సుందర్ మాట్లాడుతూ ప్రజలు మూఢనమ్మకాలు విడనాడి ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

• పరిహారం అందించాలని బాధితుల నిరసన

జి.కొండూరు: పులివాగు వరద ఉధృతికి మంపునకు గురైన తమకు పరిహారం అందించకపోవడం దారుణమని గడ్డమణుగు ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డమణుగు ఎస్సీ కాలనీకి చెందిన 40 మంది బాధితులు విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. బాధితుల జాబితాలో తమను కూడా నమోదు చేసి పరిహారం అందించాలని వారు కోరారు.

• సూపర్ సిక్స్ అమలు చేయాలని ధర్నా

చాట్రాయి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం పుల్లారావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కోటపాడు, చీపురుగూడెం గ్రామ సచివాలయాల వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వంద రోజులు గడిచినా పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

• కరాటేలో విద్యార్థి ప్రతిభ

తిరువూరు: తెలంగాణ రాష్ట్రంలోని మిర్యాలగూడలో సెప్టెంబర్ 29న జరిగిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో తిరువూరు శ్రీనిధి స్కూల్ విద్యార్థి రోహన్ పునీత్ కుమిటీ విభాగంలో తృతీయస్థానం సాధించాడు. జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొందిన ఆరో తరగతి విద్యార్థి గోదా రోహన్ పునీత్‌ను పాఠశాల కరస్పాండెంటు కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్ వెంకట నారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

• ఎమ్మెల్యే వసంతను కలిసిన మైలవరం ఏసీపీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను మైలవరం ఏసీపీ ప్రసాదరావు మంగళవారం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి మొక్కను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు.

• ట్రిపుల్ ఐటీ ఫైనాన్స్ ఆఫీసర్‌గా నాగార్జునదేవి

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీ ఫైనాన్స్ ఆఫీసర్‌గా దువ్వూరి నాగార్జున దేవిని నియమిస్తూ వైస్ చాన్సలర్ ఎం.విజయ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎస్సీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నాగార్జున దేవి గతంలో ఫైనాన్స్ ఆఫీసర్‌గా, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్‌గా పనిచేశారు.

• గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

నూజివీడు/ముసునూరు: మండలంలోని అన్నవరం, హనుమంతులగూడెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల సాగులో ఆధునిక పద్ధతులు, వరిసాగులో ఖర్చు తగ్గించుకోవడం, మామిడి సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వ్యవసాయశాఖ నూజివీడు సహాయ సంచాలకులు జి. విద్యాసాగర్ వివరించారు. ముసునూరు మండలంలోని గుళ్లపూడి శివారు గుడిపాడు, వలసపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి సందిపాము మధుమోహన్ రైతులకు పలు సూచనలు చేశారు.

సంతృప్తికరంగా సేవలందించా

ఆర్డీఓ మాధవి

తిరువూరు: తాను తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారిగా ప్రజలకు సంతృప్తికర స్థాయిలో సేవలందించానని ఇక్కడి నుంచి అమలాపురం బదిలీ అయిన ఆర్డీఓ కె. మాధవి అన్నారు. తిరువూరు ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం రాత్రి మాధవికి వీడ్కోలు పలకడంతో పాటు ఇక్కడ నియమితులైన మాధురికి ఆహ్వానం పలుకుతూ రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతులు, సామాన్య ప్రజలకు రెవెన్యూ శాఖ ద్వారా సత్వర సేవలందించేందుకు అన్ని స్థాయిల అధికారులు సహకరించారని, సార్వత్రిక ఎన్నికలను కూడా ఎటువంటి సమస్యలూ లేకుండా శాంతియుతంగా నిర్వహించామన్నారు. తిరువూరు ఆర్డీఓగా నియమితులైన మాధురి మాట్లాడారు. మాధవిని తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఏకొండూరు, రెడ్డిగూడెం తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు, వీఆర్ఏలు సత్కరించారు.